
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 16 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

16-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	27
బాపట్ల	36	28
రెంటచింతల	34	27
చీరాల	36	28

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

- ఏఎంసీలలో కొత్త లైసెన్సులకు సవరణ
- దాదాపు రెట్టింపు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్షకు పెంపు
- పంట ఉత్పత్తులన్నీ ఒకే కేటగిరిలోకి తెచ్చిన మార్కెటింగ్ శాఖ

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇక నుంచి కొత్త లైసెన్సులు పొందాలంటే బ్యాంక్ గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో నివేదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న వాటిని రెట్టింపు చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ఏఎంసీలకు చేరాయి. గతంలో పండ్లు, కూరగాయలకు కలిపి ఒకే కేటగిరి చార్జీలు ఉండేవి. అలానే ఇతర పంట ఉత్పత్తులకు బ్యాంకు గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో ఉండేవి. ఇప్పుడు కూరగాయలు, పండ్లు ఇతర పంట ఉత్పత్తులు అన్న వ్యత్యాసం లేకుండా అన్నింటినీ ఒకే కేటగిరి కిందకు తీసుకొచ్చి బ్యాంకు గ్యారెంటీలను ప్రభుత్వం సవరించింది. దీని వల్ల రేపటి రోజున లైసెన్సుదారు మోసానికి పాల్పడినా బ్యాంకు గ్యారెంటీని సీజ్ చేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు సంబంధిత ఏఎంసీలకు వెసులుబాటు కలుగుతుంది.

కొత్తగా బ్యాంకు గ్యారెంటీలు ఇలా..

ఏఎంసీలలో చివరిసారిగా 2000 నవంబరులో బ్యాంకు గ్యారెంటీలను జీవో నంబరు 85 ద్వారా అప్పటి ప్రభుత్వం సవరించింది. వాటిని ఇప్పుడు పునఃసమీక్షించి సవరణలు చేస్తూ జీవో నంబరు 21 అమలులోకి తీసుకొచ్చింది. గతంలో కూరగాయలు, పండ్లకు టర్నోవర్ రూ.కోటి లోపు ఉంటే రూ.50 వేలు, రూ.కోటి నుంచి (మిగతా 7వ పేజీలో)

చినుకు రాలదాయె!

- 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- పంటల సాగు తడబాటు
- తొలకరి కోసం రైతుల ఎదురు చూపులు
- సాగుకు సిద్ధం చేసిన భూములు
- ఆందోళనలో అన్నదాతలు

మూడు జిల్లాల్లో పంటల సాగు ఇలా..

మూడు జిల్లాల్లో వరి, పత్తి, మిరప, కంది, పొగాకు విస్తృతంగా సాగు చేస్తారు. ప్రధాన పంటల సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు. మెట్ట పైర్లు సాగుకు పొలాలను రైతులు దుక్కి చేసుకున్నారు. వరి సాగు కోసం దుక్కులు దున్నేందుకు సాహసం చేయడం లేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న ఆందోళన అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది.

మేరికపూడి ప్రాంతంలో విత్తనం విత్తేందుకు అచ్చు తోలుతున్న రైతు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు జిల్లాల్లోని 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్లలో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైంది. 16 మండలాల్లో అత్యధిక లోటు, 8 మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 40 మి.మీ సాధారణ వర్ష పాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 18.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ (మిగతా 7వ పేజీలో)

రోహిణిలో ఊరించిన వర్షాలు.. మృగశిరలో ముఖం చాటేశాయి. మృగశిరకు స్వాగతం పలుకుతూ అన్నదాతలు కోటి ఆశలతో ఉత్సాహంగా ఏరువాక సాగారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సమాయత్తమయ్యారు. కానీ, చినుకు రాలకపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు జాప్యం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రాజెక్టులు నిండటంతో పంటలను విస్తృతంగా రైతులు సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరుజల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు.

4,500 మందికి స్థానచలనం

- ముగిసిన ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్
- బదిలీల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్!
- మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో 200 మంది మిగులు

విద్యాశాఖ కొరడా!

- విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ
- గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు
- ప్రభుత్వానికి నివేదిక

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

- ప్రచార గోడ ప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

నేటి నుంచి చేపల వేట ప్రారంభం

- ముగిసిన విరామం.. బోట్లు సిద్ధం

7

పీ-4కు అంతా సిద్ధం!

పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడానికి సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి దాతల సహకారంతో పాటు ప్రభుత్వం వైపు నుంచి కూడా అన్ని విధాలుగా ఊతమిచ్చి పీ-4ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో పీ-4కు అర్హత కలిగిన బంగారు కుటుంబాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మార్గదర్శకుల జాబితా కూడా దాదాపుగా సిద్ధమయింది. పీ-4 అమలు పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం కూడా జరిగింది. పీ-4 అమలు తీరుతెన్నులకు సంబంధించి తాజాగా అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఆగస్టు నెల నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు.



పీ4కు సంబంధించి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి (ఫైల్ ఫొటో)

- కొలిక్కి వచ్చిన బంగారు కుటుంబాల సర్వే
- పేదరికంలో 60,560 కుటుంబాలు
- మార్గదర్శకులకు అనుసంధానం చేసే దిశగా చర్యలు
- ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో అమలు
- ప్రత్యేక అధికారుల నియామకం
- నేడు 12 బంగారు కుటుంబాలకు పీ4 సాయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సచివాలయాల వారీగా చేపట్టిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 60,560 కుటుంబాలు కడు పేదరికంలో ఉన్నట్లు గుర్తించారు. వీరందరిని బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి పీ-4 అమలుపై దృష్టి సారించారు. 229 మంది మార్గదర్శకులను అధికారులు సమీకరించగలిగారు. వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులను కూడా మార్గ దర్శకుల జాబితాలో చేర్చి ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలన్నీ అందేలా వారు చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటితో పాటు బంగారు కుటుంబాలతో గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారిని స్వయం సాధికారతవైపు నడిపించనున్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయాలతో పాటు మహిళలకు ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ వంటివన్నీ కూడా ఇచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లనున్నారు

బంగారు కుటుంబాల జాబితా భారీగా...

పీ-4 సర్వే మొదలయినప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో బంగారు కుటుంబాలు 40,000లోపే ఉండనున్నాయని అధికారులు భావించారు. కానీ సర్వే పూర్తయ్యేసరికి జాబితా 60,560గా తేలడంతో వీరందరికి



పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబం స్థితిగతులను పరిశీలిస్తున్న బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి (ఫైల్ ఫొటో)

మార్గదర్శకులను చూడడం కూడా యంత్రాంగానికి సవాల్‌గా మారింది. బంగారు కుటుంబాలకు అండగా ఉండడానికి ఇప్పటికి 229 మంది మార్గదర్శకులు ముందుకొచ్చారు. కానీ ఆసరా కోరుకుంటున్న కుటుంబాలు భారీగా ఉండడంతో మండలాల వారీగా మార్గద ర్శకుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టారు. ఒక్క ఆర్థిక ఊతమే కాకుండా ఉపాధి కల్పన, పిల్లల చదువు వంటి వాటి కి అంగీకారం తెలిపే వారిని కూడా మార్గదర్శకుల జాబితాలో చేర్చాలని నిర్ణయించారు. ఇంతకుముందు ఒక్క మార్గదర్శకుడికి 5 బంగారు కుటుంబాలను అప్పగించాలనే ఆలోచనను అధికారులు చేశారు. కానీ జాబితా భారీగా ఉండడంతో ఒక్కొక్కరికి 10 బంగారు కుటుంబాల బాధ్యత ఇవ్వనున్నారు

నేతల పాత్రే కీలకం

పీ-4 విజయవంతం కావాలంటే ప్రధానంగా నేతల సహకారమే కావాల్సి ఉంది. ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలలో ఆర్థికంగా బలంగా ఉండి సొసైటీకి కొంతైనా తిరిగివ్వాలనే భావన ఉన్నవారెవరో సహజంగా నేతలకే తెలిసి ఉండే అవకాశమే ఎక్కువగా ఉంది. వీరిని మార్గదర్శకులుగా మార్చడంలో నేతల పాత్రే కీలకం కానుంది. పీ-4 అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అమలు పురోగతిపై ఇటీవలే కలెక్టర్ వెంకటమురళి అన్ని విభాగాల అధికారులతో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు.

నేడు 12 కుటుంబాలకు సాయం

పీ-4 అమలులో భాగంగా సోమవారం 12 బంగారు కుటుంబాలకు డీఆర్‌డీఏ సారథ్యంలో సాయం అందించనున్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా ఏప్రిల్ 1న చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెం వచ్చిన సీఎం చంద్రబాబు గ్రామంలో పీ-4ను ప్రణాళిక బద్ధంగా అమలు చేసి స్వర్ణ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇద్దరు మార్గదర్శకులను కూడా అదే వేదికపై సీఎం పరిచయం చేయడంతో పాటు బంగారు కుటుంబాలకు వారిని అనుసంధానం చేశారు. గ్రామంలోని మొత్తం 33 కుటుంబాలను పీ-4 పథకం అమలులో భాగంగా పేదరికం నుంచి బయటపడేసేలా అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు.

ఉన్నట్టా.. లేనట్టా!?



- వ్యవసాయ శాఖలో బదిలీలు గందరగోళం
- జీఓ విడుదలై వారం దాటినా రిలీవ్ చేయని వైనం
- తలలు పట్టుకుంటున్న డీడీఏ, ఏడీఏలు
- ఒకరిద్దరి కోసం అందరితో ఆటలు

జోన్ -3లో పెద్దగా ఇబ్బందులు లేకున్నా..

గుంటూరు సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల వ్యవహారం గందర గోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు అధికారులను బదిలీ చేస్తున్నట్లు గత వారం ప్రభుత్వం జీవో విడుదల చేసినా దాన్ని అమలు పరచక పోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఎందుకు రిలీవ్ చేయడం లేదో అర్థం కాక చాలా మంది అధికారులు టెన్షన్‌తో తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో బదిలీల కోసమని ప్రభుత్వం విధించిన గడువు కూడా ముగిసింది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య బదిలీల సందర్భంలో మొదలైన గిల్లికజ్జాలకు మాత్రం ఫులుస్టాప్ పడకపోవడం అధికారుల పాలిట శాపంగా మారినట్లు చెబుతున్నారు.



బదిలీ జీవోను పక్కన పెట్టించడానికి ప్రధాన కారణం జోన్ -1, 2లో జరిగిన పొరపాట్లు అని తెలుస్తోంది. అయితే జోన్-3 కిందకు వచ్చే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అటువంటివి జరగలేదన్నది అధికారుల వాదన. ఒకరిద్దరి కోసం అందరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 30 మంది

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 30 మంది వ్యవసాయ అధికారుల బదిలీ వ్యవహారం ఎటూ తేలకుండా ఉంది. వారిలో పలువురు డీడీఏలు, ఏడీఏలు ఉన్నారు. బదిలీ జీఓ విడుదలైన ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (మిగతా 7వ పేజీలో)

బర్లీ కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వానిదే..!

- పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ ఇచ్చేందుకు కేంద్ర మంత్రి గోయల్ ససేమిరా
- ఆ నిధి అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని వ్యాఖ్య
- మిన్నకుండిపోయిన రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులు



సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, మంత్రి టీజీ భరత్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హై డెన్సిటీ బర్లీ పొగాకు కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గుంటూరు నగరంలో పొగాకు బోర్డు సందర్శన సందర్భంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రం సాయాన్ని ప్రకటిస్తారని అంతా ఆశించారు. అయితే ఆయన బర్లీ పొగాకు ప్రస్తావన జోలికి పోలేదు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పాల్గొన్న ఈ సమీక్షలో ఒకరిద్దరు బర్లీ పొగాకు అంశాన్ని ప్రస్తావించారు. పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒక శాతం ఫీజుని వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వద్ద రూ.వందల కోట్ల నిధులు కార్పస్ ఫండ్ రూపంలో ఉన్నాయి. వాటి నుంచి కొంత మొత్తంలో నిధులను బర్లీ పొగాకు కొనుగోళ్లకు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తగా.. అందుకు కేంద్ర మంత్రి గోయల్ సున్నితంగా తిరస్కరించారు. పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. దీంతో ఇక రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెట్ కమిటీల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లను చేపట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. రైతుల నుంచి 20 మిలియన్ కేజీల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.300 కోట్లు అవసరమవుతాయి. అందులో సగం రూ.150 కోట్లు బోర్డు నుంచి కేటాయించమని కోరినా మంత్రి నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఎన్ఐడీ, ఇండస్ట్రియల్ పార్కులపై సమీక్ష..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) గురించి మంత్రి గోయల్ సమీక్ష చేశారు. అమరావతి రాజధానిలో సగల హంగులతో ఎన్ఐడీ భవనాల నిర్మాణం చాలా వరకు పూర్తయింది. విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహిస్తున్నామని అధికారులు నివేదించడంతో.. మంత్రి గోయల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఐడీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పైనా మంత్రి గోయల్ సమీక్షించారు. రాష్ట్రంలో నిర్మాణం జరుగుతున్న కృష్ణపట్నం పార్కు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. దీని తర్వాత మరో మూడు ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి ఎన్.యువరాజ్, టుబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, డీడీ దివాకర్ పాల్గొన్నారు.



దిక్సూచి

ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచ్‌లు ఏమిటో చూద్దాం.

ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఐఐటీల్లో

1. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్

ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.

ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.

భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్

అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.

అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.

భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్

ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.

అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.

ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)

ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ

క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.

అవకాశాలు: క్వాంటమ్ ఆల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటన్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.

భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫి, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్

ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.

అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్

ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.

6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)

ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్

మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.

అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.

భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జి క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నెటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+ సైకాలజీ)

గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నెటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.


అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథీస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.

భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్, ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్

అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలీకామ్ కంపెనీల్లో, ఎల్అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐవోటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.

భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)

అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈవీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.

భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పేస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'క్రీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయిన్‌బిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహా ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు అల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా.. గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏవైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరపున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.



'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర' టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కూర్ రామ్‌మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటే సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు.



తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం

● పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

దాచేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వందేళ్లుగా సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన గురజాల నియోజకవర్గ 9వ మహా సభలో ముప్పాళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మిక, కర్షక హక్కుల కోసం.. రైతులు, రైతు కూలీలకు న్యాయం కోసం పోరాడింది భారత కమ్యూనిస్టు పార్టీయేనని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతోందని ఆరోపించారు. అదాని, అంబాని లాంటి దిగ్గజ కార్పొరేట్లు ప్రపంచ కుబేరులుగా మారుతుండగా పేదలు నిరు పేదలుగా మారుతున్నారని విమర్శించారు. అమెరికా ఏం చెబితే మోదీ ఆ విధం గా ఆచరించే విధానానికి అలవాటు పడ్డారని ఎద్దేవా చేశారు. ఇజ్రాయెలు దాడులు చేయడం, యుద్ధోన్మాదానికి మోదీ ప్రభుత్వం మద్దతు పలకడం ప్రమాదకర సంకేతాలు ఇస్తున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఏ మారుతీ ప్రసాదు, కాసా రాంబాబు, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరవపట్నం రామకృష్ణ, మాచర్ల కార్యదర్శి ఎం శ్రీనివాసరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఏకే నాగమణి, గురజాల కార్యదర్శి రమణారెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

నకరికల్లు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో వేగంగా వెళ్తున్న లారీ ఢీకొని ఆదివారం ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. నకరికల్లుకు చెందిన కండ్లకుంట సైదులు(25) నకరికల్లులో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించగా.. చికిత్స పొందుతూ సైదులు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చేబ్రోలులో ఆదివారం 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం చేబ్రోలులోని పాతరెడ్డిపాలెం ప్రాంతంలోని నరాలశెట్టిపాలెం ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కే వాసు అనే వ్యక్తికి చెందిన గృహం వద్ద మూటల్లో నిల్వ ఉంచిన 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

4,500 మందికి స్థానచలనం

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్వల్ప ఆందోళనలు, ఉద్రిక్తతల నడుమ ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారం ఉదయంతో ముగిసింది. జిల్లా పరిష త్, ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమా న్యాల ఆధ్వర్యంలో దాదాపు 4,500 మందికి స్థాన చలనం కలిగింది. సోమవారం నుంచి కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 27 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత స్కూల్ అసిస్టెంట్స్‌కు, ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్

ఉపాధ్యాయుల బదిలీల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే అనేక మంది ఉపాధ్యాయులకు షాక్ తగింది. ఈ బదిలీ ప్రక్రియ మున్సిపల్ పట్టణాల మధ్య పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించారు. దీంతో అనేక మంది కౌన్సెలింగ్ కేంద్రంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొంతమంది మంగళగిరి కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వాస్తంగా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో దాదాపు 25 సంవత్సరాల నుంచి బదిలీ ప్రక్రియ సక్రంగా జరగడం లేదు. దీంతో ఒకే చోట ఉపాధ్యా యులు సంత్సరాల తరబడి పనిచేస్తున్నారు. కొంతమంది సొంత ఇళ్లు నిర్మించుకుని, పిల్లల్ని అక్కడే చదివించుకుంటూ ఉన్నారు. ఇటువంటి వారు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి అయిష్టంగానే సుముఖత వ్యక్తం చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో దాదాపు 200 మంది వరకు అదనపు ఉపాధ్యాయులు ఉన్నట్లు తేలింది. వీరికి క్లస్టర్ పాఠశాలల కింద పనిచేయాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక్కొ క్లస్టర్ పరిధిలో ఉన్న 15 పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే మిగులు ఉపాధ్యాయులను అక్కడికి పంపేలా ఏర్పాట్లు చేశారు. పదవీ విరమణ వల్ల ఏర్పడే ఖాళీల ప్రకారం వీరిని పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు సజా వుగా జరగడం, ప్రభుత్వం కొన్ని అనుకూల నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్‌పై వెల్లువెత్తిన నిరసనలు

ఎస్జీటీల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ప్రకారం నిర్వహించాలని తొలుత ప్రభుత్వం భావించింది. అయితే ఉపాధ్యాయులు దీనివల్ల ఒక్కో ఉపాధ్యాయుడు 3 వేల ఆప్షన్లు ఎంచుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే మ్యాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న మధ్యాహ్నం నుంచి ఎస్జీటీలకు మ్యాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ ప్రారంభించాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యల వల్ల మరసటి రోజుకు వాయిదా వేశారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ప్రారంభమైంది. సాంకేతిక కారణాలతో మళ్లీ అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు ప్రక్రియ ముగించారు. దాదాపు 15 రోజుల పాటు వివిధ దశల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది.

విద్యాశాఖ కొరడా!

విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ
గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు
ప్రభుత్వానికి నివేదిక

గుంటూరు విద్య, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన సీట్లకు ప్రవేశాలు నిరాకరించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలపై విద్యాశాఖ కొరడా ఝుళిపిచింది. ఇటువంటి స్కూళ్లను గుర్తించి వాటి గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో విద్యాహక్కు చట్టం ద్వారా దాదాపు 1,150 సీట్లు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వచ్చాయి. ఈ నెల 10వ తేదీలోగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే కొన్ని స్కూళ్లు విద్యాహక్కు చట్టం ప్రవేశాలను నిరాకరిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు అందడంతో.. విద్యాశాఖకు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాలు బుట్ట దాఖలు

విద్యాహక్కు చట్టం ప్రకారం ఇటీవల కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించాలని ప్రైవేటు స్కూళ్లకు వెళ్లగా నిరాకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అవమానకరంగా మాట్లాడారు.దీంతో వారు గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయా స్కూళ్ల యాజమాన్యాలకు రెండు రోజుల క్రితం విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. దీంతో కొన్ని యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకునేందుకు ముందుకు రాగా మరి కొంతమంది వివిధ పత్రాలు లేవని ఇతర సాకులు చూపి అర్జీఈ ప్రవేశాలను నిరాకరిస్తున్నారు. ఇటువంటి స్కూళ్ల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని విద్యాశాఖ నిర్ణయించింది. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తాము కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నామని ప్రవేశాలు కల్పించలేమని స్పష్టం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం నుంచి కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ద్వారా ఎవరికైతే ప్రభుత్వం సీట్లు కేటాయించిందో వారిని తప్పనిసరిగా స్కూళ్లలో చేర్చుకోవాల్సిందేనని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బిడ్డల బాధ్యత

● ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల సంరక్షణను బిడ్డలు బాధ్యతగా తీసుకోవాలని ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. మండల న్యాయ సేవాకమిటీ ఆధ్వర్యంలో బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వయో వృద్ధులపై వేధింపులు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయవాది కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పెద్దలు వృద్ధాప్యంలో సరైన ఆదరణ లేక అనేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను సంరక్షించుకోవటం చట్టపరమైన బాధ్యతగా గుర్తించాలన్నారు. బాధ్యతను విస్మరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. వృద్ధుల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించిన చట్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జీఎస్ నాగమోహన్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు, కనపర్తి రాజారావు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్యానల్ లాయర్ కిరణ్‌కుమార్

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

(5వ పేజీ తరువాయి)

రూ. 5 కోట్ల మధ్యన ఉంటే రూ.లక్ష, రూ.5 కోట్ల కంటే అదనంగా ఉంటే రూ. 2.50 లక్షల బ్యాంకు గ్యారెంటీని ముందుగానే సమర్పించాలి. ఇతర ఉత్పత్తులకు అయితే వరుసగా రూ. లక్ష, రూ.2 లక్షల, రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50 వేలు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు అన్ని నోటిఫైడ్ వ్యవసాయ ఉత్పత్తులను ఒక గొడుగు కిందకు చేర్చి టర్నోవర్ రూ. కోటి లోపు ఉంటే రూ.2 లక్షలు, రూ. కోటి నుంచి రూ.5 కోట్ల మధ్యన ఉంటే రూ.4 లక్షలు, రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7 లక్షలు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకు ఎంత టర్నోవర్ ఉన్నా రూ.లక్షగా బ్యాంకు గ్యారెంటీని నిర్ణయించారు. ఈ సవరణలు కేవలం కొత్తగా జారీ చేయబోయే కమీషన్ ఏజెంట్ లైసెన్సులకు మాత్రమే వర్తింపు చేస్తారు.

మిర్చి యార్డులో కొత్త లైసెన్సుల జారీకి సన్నాహాలు

మిర్చి యార్డులో అతి త్వరలోనే కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని మార్కెటింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు కొంత మంది పేర్లను మార్కెటింగ్ అధికారులకు నివేదించి వాళ్లకు లైసెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై మార్కెటింగ్ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అనుమతి రావాల్సి ఉంది. కాగా మిర్చి యార్డులో లైసెన్సు ఉంటే దానిని లీజుకు తీసుకొని ఏటా రూ.3 లక్షలకు పైగా నగదుని బడా వ్యాపారులు చెల్లిస్తుంటారు. దీంతో కొత్త లైసెన్సు పొందేందుకు రూ. 20 లక్షల వరకు చెల్లించడానికి కూడా వెనుకాడరు.

చినుకు రాలదాయె!

(5వ పేజీ తరువాయి)

శాఖ వెల్లడించింది. 54.5 శాతం లోటు నమోదైంది. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. దుర్గి, కారంపూడి, అచ్చంపేట, అమరావతి, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో 35.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 30.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 14.5 శాతం లోటు ఉంది. 25 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు, ఆరు మండలాల్లో సాధారణ, ఐదు మండల్లాలో అధిక, ఒక మండటంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చుండూరు, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, కొరిశపాడు, చినగంజాం మండలాల్లో అత్యధిక లోటు, అమృతలూరు, బట్టిప్రోలు, చెరుకుంపల్లె, బల్లికురవ, పర్చూరు, చీరాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో 22.7 శాతం లోటు వర్షపాతం ఉంది. ఇప్పటి వరకు 48.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాల్లోని 6 మండలాల్లో అత్యధిక లోటు, మరో ఆరు మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధారణ, ఒక మండలంలో అధిక, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు ఈస్ట్ మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం ఉంది. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు వెస్ట్, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

ఉన్నట్టా.. లేనట్టా!?

(5వ పేజీ తరువాయి)

సదరు అధికారులు పనిచేసే చోట నుంచి ఉన్న ఫలంగా రిలీవ్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే ఎవరినీ రిలీవ్ చేయవద్దని డీఏఏలకు కమిషనర్ కార్యాలయం నుంచి సందేశం వచ్చింది. 10వ తేదీ నుంచి సవరించిన జాబితా వస్తుంది రిలీవ్ కావచ్చు అని బదిలీ అయిన అధికారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా సవరించిన జాబితా విడుదల కాకపోవడం అధికారుల్లో అసహనానికి కారణం అవుతుంది.

మార్పులు జరుగుతాయని..

ఈ నెల 9న విడుదలైన మండల వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వుల ను తర్వాత సవరించారు. డీడీఏ, ఏడీఏల జాబితానూ సవరిస్తారేమోననే అను మానం చాలామందిలో ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమైంది. బదిలీ సంగతి ఏమయ్యిందో తేలకుండా పిల్లల విషయంలో నిర్ణయం తీసుకోవడం కష్టతరమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు.

బీసీ సంక్షేమానికి శంకరరావు కృషి : కేంద్ర మంత్రి పెమ్మసాని



బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు మనోహర్, సత్యకుమార్, పార్థసారథి, బీసీ నేతలు

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా బీసీల సంక్షేమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఎంతగానో కృషి చేస్తున్నారని, బీసీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం కేసన శంకరరావు దంపతులను బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ అతిపెద్ద బీసీ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గత ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా కూటమి గెలుపు కోసం కేసన పని చేశారని గుర్తుచేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ స్వార్థం లేకుండా బీసీల అభివృద్ధికి శంకరరావు పని చేశారన్నారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీసీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే కృషి చేస్తే రాష్ట్రంలో శంకరరావు పని చేశారని అభినందించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి రాజీపడకుండా శంకరరావు పోరాడుతారన్నారు. సన్మాన గ్రహీత శంకరరావు మాట్లాడుతూ పేదల ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశానని, పదవులకు ఆశపడకుండా పని చేస్తున్నానన్నారు. జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో శంకరరావు జీవిత విశేషాలతో రూపొందించిన 'జయహో బీసీ బంధు కేసన శంకరరావు' సంచికను ఆవిష్కరించారు. కన్నా మాస్టారు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, హకీంజాని, ఓంకార్ ప్రసాద్, గంటయ్య, గౌరీశంకర్, గాదె వెంకటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

● ప్రచార గోడప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్



వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డయేరియా రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నామన్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తెనాలిలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలసి మంత్రి డయేరియా నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో ప్రమాదకరమైన వ్యాధి డయేరియాపై విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ నెల 16 నుంచి జూలై 31 వరకు ఇంప్లిమెంటేషన్ ఫేజ్ 2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల సంస్థల ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి, వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి వేముల ప్రియాంక, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, 104 జిల్లా మేనేజర్ రాఘవకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్ర జ్యోతి): అత్యుత్తమ విద్యను అందించి, అభివృద్ధికి సోపానంగా నిలిచిన పాఠశాలల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర దేవస్థాన కల్యాణ మండపంలో జరిగిన పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థులైన ప్రజా ప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పూర్వ విద్యార్థి మోదుగుల వాసుదేవరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగానే కాకుండా, పూర్వ విద్యార్థిగా తనకు విద్యను నేర్పిన సీతారామయ్య హైస్కూల్ అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేస్తానన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సీతారామయ్య హైస్కూల్ విద్యా రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ.. తన ఉన్నతికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి సీతారామయ్య హైస్కూలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, ఎ.సి.పి గుంటుపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ ద్వారక సుశీల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, వసంత కృష్ణప్రసాద్, మేయర్ రవీంద్రను పూర్వవిద్యార్థి సంఘ నాయకులు గోగినేని విజయ్‌కుమార్, మోదుగుల వాసుదేవ రెడ్డి, జవహర్ ఆధ్వర్యంలో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ ఈఈ నాగమల్లేశ్వరరావు, ఆర్వీఆర్ మాజీ ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్, డాక్టర్ యశోద, శాంతిశ్రీ, అనంత శేఖర్, గట్టినేని వెంకటేశ్వరరావు, మండలి శ్రీనివాస్, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పెద్ది శ్రీనివాస్, దివాకర్, కొమ్మినేని కోటేశ్వర రావు, బంగారు బాబు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : డీఈవో

నరసరావుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్ స్కూల్)ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి అపరాధ రుసుం లేకుండా జూలై 30వ లోపు, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు దగ్గర్లోని సచివాలయం, మండల విద్యా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి చేపల వేట ప్రారంభం

రేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతమైన నిజాంపట్నం హార్బర్, లంకేవానిదిబ్బ, కొత్తపాలెం, నక్షత్రనగర్‌లో చేపల వేట విరామ సమయం ముగిసింది. సోమవారం నుంచి సముద్రంలో వేట కొనసాగించేందుకు మత్స్యకారులు బోట్లను సిద్ధం చేసుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే హార్బర్‌లో గంగపుత్రులు సముద్రమ్మతల్లికి, బోట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేటకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నాపెద్ద బోట్లు సుమారు 700పైనే ఉన్నాయి. 2వేల కుటుంబాలు సముద్రవేట చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

బాపట్ల వార్తలు

• బాపట్ల • వేమూరు • రేపల్లె

అక్రమ కట్టడాలకు అడ్డుకట్టపడేనా?

- పెరిగిపోతున్న అక్రమ నిర్మాణాలు
- తగ్గిపోతున్న మున్సిపల్ ఆదాయం
- ఛార్జ్‌షీట్‌లతో సరిపెడుతున్న అధికారులు

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాలకు అడ్డులేకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు నిర్మాణాలు చేపడుతుండగా మరికొందరు అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూస్తూ ఉండిపోవాల్సి వస్తుంది. కేవలం సిఫార్సుల మేరకే కొన్ని కట్టడాలపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారు. మరికొన్నిటికి కోర్టులో ఛార్జ్‌షీట్‌లు వేసి చేతులు దులుపుకుంటున్నారు పట్టణ నడిబొడ్డున ప్రధాన కూడళ్లలో నిర్మాణాలు జరుగుతున్నా ఆపటంలో అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. దీనివల్ల అక్రమ కట్టడాలు చేపట్టేవారు రెచ్చిపోతున్నారు. బహుళ అంతస్థు భవనం నిర్మించాలంటే కనీస 30 అడుగుల రోడ్డు ఉండాలి. అయితే కొన్నిచోట్ల 15 అడుగుల రోడ్డు కూడా లేని చోట నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో అన్ని సక్రమంగా ఉన్నట్లు చూపించి తర్వాత తమదైన శైలిలో నిర్మాణాలు జరుపుతున్నారు. సెట్‌బ్యాక్ నిబంధనలు


బాపట్లలోని షరాఫ్‌బజారులో నిర్మించి రంగులు వేస్తున్న అక్రమ కట్టడం


బాపట్ల ఎల్ఐసీ కార్యాలయం పక్కనే వేర్వేరు ప్లాన్‌లు తీసుకొని బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తున్న చిత్రం

ఏమాత్రం పాటించటంలేదు. ఇరుకుసందులలో సైతం నిర్మాణాలు పెరుగుతూనే ఉన్నాయి. అగ్నిప్రమాదాలు సంభవిస్తే కనీసం వాహనం వెళ్ళే పరిస్థితి కూడా కనిపించటంలేదు. కొంతమంది జీ +2 నిర్మాణానికి అనుమతులు తీసుకొని జీ+4 నిర్మిస్తున్నారు. మూడుప్లాన్‌లుగా తీసుకొని ఒకే బహుళ అంతస్థు భవనం కూడా నిర్మిస్తున్నారు. జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా నిర్మాణాలు చేయటం వల్ల పార్కింగ్ ప్రాంతంలేక రోడ్లపైనే వాహనాలు పెట్టి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. ప్లాన్‌లో పార్కింగ్ ప్లేస్ చూపిస్తూ నిర్మాణంలో మాత్రం పార్కింగ్ ప్రాంతంలో కూడా పూర్తిగా కట్టడాలు చేపట్టి అద్దెలకిస్తున్నారు.

పట్టణంలోని న్యూషరాఫ్ బజారులో బహుళ అంతస్థు భవనం నిర్మించారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉంది. అదేవిధంగా ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో మూడుప్లాన్‌లతో ఒకే భవనం నిర్మించారు. భావన్నారాయణస్వామి దేవాలయం ఎదురు రోడ్డులో అక్రమ కట్టడాలు నిర్మించారు. శిఖరం వారి వీధిలో అక్రమ కట్టడాలు అనేకం ఉన్నాయి. సూర్యలంకరోడ్డులో బహుళ అంతస్థు భవనాలు నిర్మించారు. ఈవిధంగా చెప్పుకుంటూ పోతే బాపట్ల పట్టణంలోని ప్రతివార్డులో అక్రమ కట్టడాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.దీనివల్ల పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయం రావటంలేదు. ప్రమాదాలు జరిగితే రక్షణ లేకుండా ఉన్నాయి. ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు 36 అక్రమ కట్టడాలను గుర్తించి 26 కట్టడాలపై కోర్టులో ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని వివరణ కోరగా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు జరిపే వారిపై, అక్రమ కట్టడాలు చేపట్టే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరస్తులకు కొమ్ముకాస్తున్న జగన్

- టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేరస్తులకు కొమ్ముకాస్తున్నారని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ విమర్శించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో తప్పుడు కథనాలు రాస్తున్న సాక్షి మీడియాను రద్దు చేయాలంటూ ఆదివారం కరపత్రాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కించపరిచిన కొమ్మినేని శ్రీనివాసరావును ప్రోత్సహిస్తున్నది జగన్మోహనరెడ్డి, భారతిరెడ్డిలేనన్నారు. పైశాచిక ఆనందం కోసం రౌడీమూకలను సైకోలుగా తయారు చేసే పార్టీగా వైసీపీ ఉందన్నారు. రాజధాని పనులు పునః ప్రారంభమై అభివృద్ధి జరుగుతుంటే జగన్‌రెడ్డి ఓర్చుకోలేక ఉన్నారన్నారు. సాక్షి మీడియాను వెంటనే బ్యాన్ చేయాలని నినాదాలు చేశారు. నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మొవ్వా శరత్‌చంద్ర, తెలుగు మహిళ పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, కట్టా సుజాత, షేక్ నజ్మా, జి.గిరిజారాణి, రమాదేవి, లుదియా, జయ, వేమవరపు సుజాత, మస్తాన్‌బి, ఇందు, యెనుముల రాంబాబు, పరిశా గోపి తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న టీడీపీ మహిళా నాయకులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

శ్రీ లింగోద్భవస్వామి షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలోని ఖాళీ స్థలంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో గల 8 షాపులకు ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలు నుంచి దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించటం జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.5 వేలు దరవత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు. షాపులకు సంబంధించి అద్దె ఒక సంవత్సరం ముందుగానే చెల్లించాలని తెలిపారు.

శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవుల సేవలు ఆదర్శం

- యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : దళిత గిరిజన సమాజం కోసం విశేష సేవలందించిన కొర్రపాటి చెన్నకేశవులు ఆదర్శణీయులని యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్ అన్నారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో ఆదివారం చెన్నకేశవులు 57వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్రపాటి పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో శంకరప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడలలో చెన్నకేశవులు నడిచి సమాజ సేవలో విస్తృతంగా పాల్గొన్నారన్నారు. హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడారని కొనియాడారు. వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేసిన ఆయన చిరస్మరణీయులన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దళిత గిరిజన మైనార్టీ సంఘాల నాయకులు ఈమని చంద్రశేఖర్, ఎస్కే ఖాజావలి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్, కొర్రపాటి సురేష్, దారా అంబేద్కర్, గోళ్ళ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నకేశవులు పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న శంకరప్రసాద్ తదితర నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

అమృతలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వారికి నిత్యావసరాలు, వంట పాత్రలను ఆదివారం అందజేశారు. తెనాలి ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, తెనాలి వారి ఆర్థిక సహకారంతో మండల పరిధిలోని ప్యాపర్రు గ్రామంలో బాధితులు సాంగ సునీత, గోపాలం శివకుమారిలకు అందించారు. ఈ కార్యక్రమంలో నాళ శ్రీమన్నారాయణ, సాంబశివరావు, మైనేని రత్నప్రసాద్, చందోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ఫెన్సింగ్ ఏర్పాటు


ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్న విశ్వబ్రాహ్మణులు

కర్లపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని గణపవరం రోడ్డులో ఉన్న విశ్వబ్రాహ్మణుల శ్మశాన వాటికను విశ్వబ్రాహ్మణ నాయకులు ఆదివారం ముళ్ళచెట్లను, పిచ్చిచెట్లను తొలిగించి శుభ్రపరిచారు. శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా శ్మశానం చుట్టూ స్తంభాలు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాలను నాయకులు జిడుగు శ్రీనివాసరావు, జిడుగు వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

పెద్దిరెడ్డి విమర్శలు సిగ్గుచేటు : కొల్లా

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైసీపీ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శలు చేయటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. రిమాండ్ ఖైదీ, మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డితో ములాఖత్ అయిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులా ప్రతికార రాజకీయాలకు పాల్పడిన ఏ ముఖ్యమంత్రిని చూడలేదని, ఇందుకు కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని ప్రగల్భాలు పలకటం హాస్యాస్పదమన్నారు. వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి చిత్తూరు జిల్లాలో సాగించిన అరాచకాలు, అక్రమాలు అనేకమన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

అమృతలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదపూడి తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ డాక్టర్ అత్తాల పాల్ నిరంజన్ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మృతుల కుటుంబసభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

నదిని తలపిస్తున్న చప్టా

- రోడ్డుపై నీటితో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు

కర్లపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపల్లి, నర్రావారిపాలెం ప్రజలకు ఎన్ని ప్రభుత్వాలు మారిన చప్టాపై ఉన్న రహదారి నీటితో మునిగి ఉండటంతో ప్రజలకు కష్టాలు తప్పటం లేదు. మండలంలోని నర్రావారిపాలెం, తుమ్మలపల్లి కలిసే ప్రాంతంలో పెద్ద కాల్వపై చప్టాపై నది స్థాయిలో నీరు ఉండటంతో ప్రజలు రహదారిపై ప్రయాణం చేయలేక వాహనాలు నీటమునుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చప్టా మంజూరుకి నిధులు కేటాయిస్తున్నామని ప్రకటనలు గుప్పించటం తప్ప సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. ఎంతో కాలం నుంచి ఇరుగ్రామాల ప్రజలు రహదారిపై ఉన్న నీటిలోనే వాహనాలు, దుస్తులు తడుపుకుంటూ ప్రయాణం చేస్తున్నారు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్థానిక ప్రజలు, నాయకులు ఎన్నోసార్లు అర్జీలు సమర్పించినప్పటికి బుట్టదాఖలయ్యాయేగాని సమస్య పరిష్కారం కాలేదు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని చప్టా నిర్మించి నీటిలో మునిగే వెళ్ళే బాధను తొలిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నర్రావారిపాలెంలో చప్టాపై ప్రవహిస్తున్న నీరు

టీడీపీ అభివృద్ధికి పాటుపడే వారికే పట్టం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలలో పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేసిన వారికి నాయకత్వం పట్టం కడతామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెంలోని తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. టీడీపీ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని పార్టీ శ్రేణులకు నరేంద్రవర్మ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, నాయకులు షేక్ బాజి, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, పిట్ల వసంతరెడ్డి, దొప్పలపూడి రాజశేఖర్, మద్దిబోయన బుల్లియ్య, విజయనాగరాజు తదితరులు ఉన్నారు.

అర్జున్ మృతి పార్టీకి తీరనిలోటు

బాపట్ల రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం తెలుగుదేశం పార్టీ నాయకుడు భోగిరి అర్జున్ మృతి పార్టీకి తీరనిలోటు అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. స్టూవర్టుపురం గ్రామసర్పంచ్ పోకిరి ప్రసాద్ తమ్ముడు భోగిరి అర్జున్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం నిర్వహించిన అర్జున్ అంత్యక్రియలలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొని అర్జున్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.


అర్జున్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ముగిసిన బండ్లమ్మ అమ్మవారి కొలుపులు

పిట్టలవానిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామంలో ఉన్న గ్రామదేవత శ్రీబండ్లమ్మతల్లి అమ్మవారి కొలుపుల మహోత్సవాలు 5వ రోజుతో అత్యంత వైభవోపేతంగా ముగిశాయని గ్రామపెద్దలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బండ్లమ్మ తల్లికి పొంగళ్ళు సమర్పించుకొని మొక్కుబడులను తీర్చుకున్నారు.

వాహన తనిఖీలు

పిట్టలవానిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో పలు వాహనాలను చందోలు పోలీసుస్టేషన్ ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తనిఖీలు నిర్వహించి వాహనదారులకు పలుసూచనలు చేశారు. ఆటోడ్రైవర్లు ఎక్కువగా ప్రయాణికులను ఎక్కించుకొని నడపరాదన్నారు.

మురుగు, ముళ్ళపొదలతో రైల్వే ఖాళీ స్థలం

- నివాసితులకు ఇబ్బందికరంగా మారిన వైనం

వేమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేమూరు రైల్వే స్టేషన్‌కు పడమర భాగంలో భవిష్యత్తు అవసరాల కోసం ఏడు ఎకరాల భూమిని ఖాళీగా ఉంచారు. దశాబ్దాల కాలం నుంచి ఆ స్థలం రైల్వేశాఖ ఆధీనంలో ఉంది. గ్రామం అభివృద్ధిచెందడంతో ఖాళీగా ఉన్న స్థలం వరకు నివాస గృహాలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్గాలు నివాస గృహాలు ఏర్పడడంతో ఖాళీ స్థలం పూర్తిగా పల్లమైంది. దీంతో వర్షపు నీరు, గ్రామంలో నుంచి వచ్చేమురుగు నీరు ఈ స్థలంలో చేరి ఆ ప్రాంతమంతా దుర్గంధమయంగా మారింది. స్థలానికి పడమర వైపున దాదాపుగా వందకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. మురుగునీటిలోకి వ్యర్థ పదార్థాలు చేరడం, దోమలు, ఇతరమైన విషపూరిత జంతువులు చేరడం వల్ల నివాసితులకే కాకుండా ఆ ప్రాంతం నుండి పలు మార్గాలకు వెళ్ళే వారికి కూడా సమస్యగా మారింది. ఖాళీ స్థలాన్ని మెరక చేసి రైల్వే శాఖ పార్కును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. దీనిపై స్పందన లేకపోవడంతో 2022లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఒకరు సొంత ఖర్చులతో పార్కు ఏర్పాటు చేస్తామని అందుకు అనుమతిని కోరారు. ఇందుకు కూడా అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న స్థలాన్ని మెరక చేసి పార్కు నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


వేమూరులో రైల్వే స్థలంలో నిలిచిన మురుగునీరు


నిలిచిన నీటిలోకి చేరుతున్న వ్యర్థాలు


నివాస గృహాలను కమ్మివేసిన మొక్కలు, మురుగునీరు

నేడు పెన్షనర్ల సమావేశం

రేపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సమస్యలపై సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జనరల్ సెక్రటరీ ఎం.చినరాజారత్నం తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్స్ సమస్యలపై చర్చించటం జరుగుతుందని, ఆ సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించబడుతుందని చెప్పారు. పెన్షనర్స్ అంతా ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గోపాలకృష్ణ కుటుంబానికి మోపిదేవి ఓదార్పు

చెరుకుపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నడింపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొడాలి గోపాలకృష్ణ సతీమణి కొడాలి ప్రమీల గురువారం అనారోగ్యంతో మరణించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు మోపిదేవి వెంకటరమణారావు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, డాక్టర్ కొడాలి మోహన్, డాక్టర్ కొడాలి రజనికాంత్ పాల్గొన్నారు.


ప్రమీల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణారావు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని తదితరులు

శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయాస్తమాన సేవామహోత్సవం

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తిరుమల-తిరుపతి దేవస్థానంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఉదయం సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు జరిగే విధానం గురించి తెలియజేసేందుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయాస్తమాన సేవా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞా సరస్వతీ బాలస్వామిజీ నేతృత్వంలో కనులపండువగా జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులతోపాటు ఆర్యవైశ్య ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిజీమాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంతసేవ వరకు ఏవిధంగా జరుగుతుందో అదేవిధంగా బాపట్లలో నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు కొత్తమాసు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సంజీవరావు, ఉపాధ్యక్షుడు కోళ్ళపూడి శివన్నారాయణ, పారెపల్లి వెంకటసురేష్, నాళం వేణుగోపాలరావు, తుళ్ళూరి రాము, మామిడి రమేష్‌కుమార్, కేవీఎస్ ప్రసాద్, శివకుమార్, పొన్నూరు శ్రీనివాసరావు, తూనుగుంట్ల సుబ్బారావు, తుళ్ళూరు రాంప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.


శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయాస్తమాన సేవమహోత్సవాన్ని జరిపిస్తున్న ప్రజ్ఞా సరస్వతీ బాలస్వామిజీ

ఆధునిక కవితా వైతాళికుడు శ్రీశ్రీ

- సాహితి భారతి అధ్యక్షుడు రావూరి

బాపట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహితీ జగత్తులో శ్రీశ్రీ ఒక నూతన ప్రభంజనాన్ని సృష్టించారని ఎక్కడో ఊహలోకాల్లో విహరిస్తున్న తెలుగు సాహిత్యాన్ని వాస్తవ లోకంలోకి తీసుకొచ్చిన ఆధునిక కవితా వైతాళికుడు శ్రీశ్రీ అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఆదివారం శ్రీశ్రీ 42వ వర్ధంతి సభలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, సాహితి భారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రి, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ శ్రీశ్రీ చందస్సుల సంకెళ్ళను చేదించి సామాన్యులకు అర్థమయ్యే భాషలో తాడిత పీడిత ప్రజల కష్టాలకు అక్షర రూపాన్ని ఇచ్చారని, శ్రీశ్రీ దాదాపు 280 సినిమాలకు 1000కు పైగా పాటలు రచించి తెలుగు సాహిత్య అభిమానులలో ఉత్తేజాన్ని నింపారని వివరించారు. అనంతరం దగ్గుమల్లి శామ్యూల్, కామరాజు కాళిదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్ తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఆముదాల లంక, జువ్వలపాలెం రీచ్‌ల వద్ద పోలీసుల గస్తీ

భట్టిప్రోలు, కొల్లూరు జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండలం జువ్వలపాలెం కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం ఆముదాలలంక ఇసుక రీచ్‌ల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించాలని అవనిగడ్డ, రేపల్లె డీఎస్పీలు శ్రీవిద్య, ఎ.శ్రీనివాసరావులు చర్యలు చేపట్టారు. ఆదివారం ఆముదాల లంక వద్ద ఇసుక రీచ్‌ను అవనిగడ్డ డీఎస్పీ పరిశీలించారు. ఇసుక త్రవ్వకాలకు సంబంధించి సరిహద్దులు విభేదాలు రావడంతో ఎవరు ఇసుక అక్రమ తవ్వకాలు చేయకుండా ఉండేందుకు పోలీసులు గస్తీ ఉండాలని డీఎస్పీ తెలిపారు. చల్లపల్లి ఎస్ఐతో పాటు కొల్లూరు, భట్టిప్రోలు ఎస్ఐలు కూడా జువ్వలపాలెం, ఆముదాలలంక రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలను నిరోధించేందుకు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.


ఆముదాల లంక వద్ద ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ శ్రీవిద్య, పోలీసు అధికారులు

మాజీ ఎంపీపీ లీలా వరప్రసాద్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వేగేశన


లీలా వరప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు తాతా లీలా వరప్రసాదరావును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. లీలావరప్రసాదరావు గుండె ఆపరేషన్ చేయించుకొని ఇంటి దగ్గర ఉండగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు యేమినేని శంకరరావు, ఉదయగిరి రాంబాబు, మహేష్, పమిబోయిన శ్రీనివాసరావు, తాతా దిలీప్ తదితరులు ఉన్నారు.

కంటి పరీక్షల వైద్య శిబిరం

చెరుకుపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగాల గ్రామంలో హజీశిలార్‌బి ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించి 25 సంవత్సరాలైన సందర్భంగా శంకర్ ఐ హాస్పిటల్ కాకుమాను వారి ఆధ్వర్యంలో కనగాల బీఈడీ కాలేజీలో ఆదివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గోహాజాన్ ప్రారంభించారు. ఈ శిబిరానికి 560 మంది రాగా వారిలో 187 మందికి కంటి ఆపరేషన్ చేయించాల్సి ఉందని డాక్టర్ నళిని తెలిపారు వారందరిని వారం రోజులలోపు ప్రత్యేక బస్సుల ద్వారా కాకుమానుకి తరలించి ఆపరేషన్ చేయిస్తామని శిబిరం నిర్వాహకులు అబ్దుల్ సమద్ తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ చిన్మయి, శంకర్ ఐ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అల్లుకున్న నిర్లక్ష్యం

- గాలివీస్తే కే.రాజుపాలెంలో విద్యుత్ బంద్
- ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన చిల్లచెట్లు



కే.రాజుపాలెంలో పిచ్చి మొక్కలు అల్లుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బల్లికురవ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కే.రాజుపాలెం గ్రామంలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. గతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కావడం శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి గాలి వీచినా, విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు పెద్దఎత్తున పిచ్చి మొక్కలు అల్లుకొని ఉన్న వాటిని తొలగించ లేదని వారు పేర్కొంటు న్నారు. విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంపై పర్యవేక్షణ చేపట్టడం లేదని ప్రజలు తెలిపారు. బల్లికురవ, మార్టూరు మండలాల పరిధిలోని కే.రాజుపాలెం, రాజుపాలెం గ్రామాలలో గ్రానైట్ పరిశ్రమలు కూడా ఉన్నాయని విద్యుత్ సరఫరా లేకపోతే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిశ్రమల నిర్వాహకులు తెలిపారు. అన్ని గ్రామాలలో వలే విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంతిమయాత్ర వాహనం ఏర్పాటు



దాత సిద్ధం చేసిన అంతిమయాత్ర వాహనం

ఇంకొల్లు,జూన్ 15, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లుకు చెందిన ఓ దాత తన తండ్రి నార్నె రాఘవయ్య జ్ఞాపకార్థం సుమారు రూ.3 లక్షలతో అంతిమయాత్ర వాహనాన్ని సిద్ధం చేశారు. ఈ వాహనం ఇంకొల్లు శ్మశాన నిర్వహణ కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఇంకొల్లు పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అంతిమయాత్ర వాహనం అవసరాన్ని గుర్తించి దీనిని ఏర్పాటు చేయనున్నట్లు దాత తెలిపారు. వాహన ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

పర్చూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మందుబాబులను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆదివారం కారంచేడు మండలంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, నూనె వితరణ



బియ్యం, నూనె అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి బియ్యం, నూనె అందజేశారు. డాక్టర్ సోమేపల్లి కావ్య (యూఎస్ఏ) పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు సోమేపల్లి హనుమంతరావు, అనంతలక్ష్మి సౌజన్యంతో శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమానికి 5 టిక్కిల బియ్యం, ఒక టిన్ నూనెను అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య పుట్టిన రోజు కేకును వృద్ధుల సమక్షంలో కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, రావూరి రంగయ్య, నందిరెడ్డి శ్రీనివాసరావు, ఆళహరి హరిప్రసాద్, అంజాద్‌బాషా, శేషారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలాల కేటాయింపునకు సన్నాహాలు

- తమకు కేటాయించే ప్రాంతాన్ని పరిశీలించిన కార్పెంటర్లు



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పెంటర్లు

అద్దంకి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని కార్పెంటర్లకు అద్దంకి కొండ వద్ద స్థలాలు కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంలో సుమారు 150 మంది కార్పెంటర్లు వివిధ పనులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని పలువురు కార్పెంటర్లు తమకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తే సొంతగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటామని, అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. మంత్రి రవికుమార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు అద్దంకికొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంట్లు చొప్పున, రోడ్లు, ఇతర అవసరాలకు మొత్తం 3 ఎకరాల స్థలం అవసరమని ప్రాథమిక అంచనాకు వచ్చారు. తమకు కేటాయించనున్న ప్రాంతాన్ని ఆదివారం కార్పెంటర్లు పరిశీలించారు. అద్దంకి పట్టణ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాగేశ్వరరావు, పూర్ణ, సుభాని, వెంకటేశ్వర్లు, యేజెండ్ల ఆంజనేయులు, కోటిలింగాచారి, వీరసుందరాచారి తదితరలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ చీరాల నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

చీరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. మండల కార్యాలయంలో తహసీల్దార్ గోపీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో మేనేజింగ్ కమిటీ సభ్యులుగా బూదరాజు శశికిరణ్, దాసరి ఇమ్మానియేల్, డా.ఐ.బాబురావు, డా.తాడివలస కుమార్, సూరంపల్లి తేజస్వి, మంకెన మణిబాబు, త్రోవగుంట అబ్దుల్, జంగిలి సాయికృష్ణ, మద్దిన వెంకటేశ్వర్లు, రాం ప్రసాద్, ఏకగ్రీమయ్యారు. దీంతో వారికి అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

- కొప్పెరపాడు కొండ ప్రాంతంలో జోరుగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖలు



గుర్రాల కొండ వద్ద పెద్ద ఎత్తున జరుగుతున్న మట్టి తవ్వకాలు

బల్లికురవ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు సమీపంలోని గుర్రాలకొండ ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి కొందరు మట్టి తవ్వకాలను జోరుగా చేపడుతున్నారు. మట్టిట్రాక్టర్‌కు నగదు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొప్పెరపాడు నుంచి వినుకొండ రోడ్డులోని గుర్రాల కొండ సమీపంలో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలిస్తున్నారు. రియల్ వెంచర్లకు, ఖాళీ స్థలాలకు ఈ మట్టిని విక్రయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం సుమారు పది ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఎర్ర మట్టిని తవ్వి తరలించారు. గత రెండు రోజుల నుండి ఇలానే మట్టిని తవ్వుతున్నా ఎవరు పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. అటవీ భూమి పరిధిలోని కొండ ప్రక్కనే మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఫారెస్టు అధికారులు లేనప్పుడు వారి భూములలో కూడా రాత్రుళ్లు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు వచ్చిన సమయంలో తాము పట్టాభూముల్లో మట్టి తవ్వుతున్నట్లు చెబుతున్నారు. మట్టిని తవ్వే అక్రమార్కులు వారికి అవసరమైన సమయంలో యంత్రాల ద్వారా మట్టిని తవ్వుతున్న మైనింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు గుర్రాలకొండను పరిశీలించి అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని రైతులు కోరుతున్నారు. మట్టి తవ్వకాలు చేసిన చోట పెద్ద పెద్ద కందకాలు పెడుతున్నారని వీటి వలన వర్షాలు పడితే నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెంతున్నారు.

అటవీ భూములలో మట్టి తవ్వితే చర్యలు

అటవీ భూములలో ఎవరైన మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె. రమేష్ హెచ్చరించారు. కొప్పెరపాడు గుర్రాలకొండ వద్ద మట్టి తవ్వకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో పరిశీలించామన్నారు. ఒక రైతు పట్టా భూమిలోమట్టి తీస్తున్నారని గతంలో కొండ భూమిలో కూడా కొంత తవ్విన్నట్లు ఉందన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా ఫారెస్టు భూమిలో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొండయ్య
- వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీ కండువాతో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం అభివృద్ధికే తన మొదటి ప్రాధాన్యత అని ప్రతి కార్యకర్త ఆ దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గ్రామ వైసీపీ కీలక నేతలు మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చాపల గాలెయ్య, జాతీయ మత్స్యకార సంఘం నాయకులు అర్జిల్లి సత్తిబాబు, మాజీ ఉపసర్పంచ్ రాజారావు మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలతో వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేత లు చాపల బ్రహ్మయ్య గ్రామ కమిటి అధ్యక్షులు బొంది గురవయ్య, ఆతిన శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగార్పమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

వేటపాలెం మండల పరిధిలోని నాగార్పమ్మ దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటి ప్రతినిధులు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈక్రమంలో పూజలు అనంతరం భక్తులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈపూరుపాలెం లో బూదాటి శంకర్‌రావు ఆధ్వర్యంలో జరుగుతున్న కర్రసాము శిక్షణను పరిశీలించారు. అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది ?

- అవినీతి ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ సరెండర్
- డీటీ శ్రీకాంత్ డిప్యుటేషన్‌పై బదిలీ
- మరో రెండు రోజుల్లో వీఆర్‌వోలపై చర్యలు

వేటపాలెం(చీరాల), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో గత రెండు రోజులుగా ఏం జరుగుతుందో అంతుపట్టడం లేదు. తహసీల్దార్ పార్వతిని రెండు రోజుల క్రితం సీసీఎల్ఏకు సరెండర్ చేస్తూ కలెక్టర్ వెంకట మురళీ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే తాజాగా డీటీ శ్రీకాంత్‌ను డిప్యుటేషన్‌పై నిజాంపట్నానికి పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మరో రెండు రోజుల్లో ఇద్దరు వీఆర్‌వోలపై వేటు పడనుందని, ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే చీరాల తహసీల్దార్ గోపీకృష్ణకు వేటపాలేనికి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు

కొంతకాలంగా వేటపాలెం, కొత్తపేట, రామాపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు తహసీల్దార్ పార్వతి, డీటీ శ్రీకాంత్, మరో ఇద్దరు వీఆర్‌వోలు ప్రయత్నించినట్లు రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. అంతేకాకుండా ఉన్నతాధికారుల విచారణలో నూ తహసీల్దార్ పార్వతి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఇటీవల కొంతమేరకు ఉన్నతాధికారులు వేటపాలెం రెవెన్యూ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే అనునిత్యం మండలంలో భూఆక్రమణలు, అనధికార రిసార్ట్, అక్రమ లేఅవుట్ల వ్యవహారాలతో ఇక్కడి అధికారులు పత్రికలకెక్కుతూనే ఉన్నారు. నిత్యం ఏదో ఒక అధికారి తీరు చర్చనీయాంశంగానే ఉంటుంది. ఈక్రమంలో తాజాగా మండల కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలు అనేక మలుపులు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో బదిలీల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

సచివాలయాన్ని సందర్శించిన న్యాయాధికారి



విచారిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీష్


చినగంజాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ సచివాలయాన్ని ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీష్ ఆదివారం సందర్శించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి, అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇరుపక్షాల ఆస్తి వివాదాలను విచారించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన గొల్లమూరి వెంకటరమణారెడ్డి(వాది), కోమట్ల రామాంజనేయులు, అన్నవరపు భానుప్రకాష్, ఎవీ.భాస్కర్ (ప్రతివాదులు)ల ఆస్తుల వివాదాలను విచారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, ఎస్ఐ శీలం రమేష్, గ్రామ కార్యదర్శి పీ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ బండారు దానియేలు, రెవెన్యూ సిబ్బంది, ఒంగోలు, చీరాల కోర్టు సిబ్బంది, మండల పారాలీగల్ వలంటీర్ ఎంవీ. రామారావులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపంలో ఆధునికీకరణ పనులు ప్రారంభం



కల్యాణమండపంలో చేపడుతున్న మరమ్మతులు

అద్దంకి, జూన్15 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపం సుమారు దశాబ్దకాలం క్రితం నిర్మాణం చేసినా నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడు ప్రత్యేక దృష్టిసారించి ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. దాతల సహకారంతో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సెంట్రల్ ఏసీగా చేస్తున్నారు. అదే సమయంలో పక్కనే దాతల సహకారంతో మరో భవనం నిర్మాణం చేపట్టనున్నారు. వీటిలో ఒక దానిని కళ్యాణ మండపంగా, మరో భవనాన్ని డైనింగ్ హాల్ గా వినియోగించనున్నారు. పూర్తి స్థాయిలో కల్యాణ మండపం నిర్మాణం పూర్తయితే సుమారు రెండు వేల మంది హాజరైనా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఉండే విధంగా మార్పు చేస్తున్నారు. వివాహాలు, ఇతర కార్యక్రమాలు కల్యాణ మండపంలో జరగడం ద్వారా అక్కడకు వచ్చే వారిలో అత్యధికులు ప్రసన్నాంజనేయస్వామి వారిని కూడా దర్శించుకుంటారు. దీంతో భక్తుల సంఖ్య కూడా పెరుగుతుందన్న అంచనాతో అధికారులు టీటీడీ కల్యాణ మండపం ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.



కల్యాణ మండవంలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ ఏసీ

శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం

వేటపాలెం(చీరాల), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ సహకారం ఉంటుందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు పత్తి ముత్తుకమరన్, గోవర్ధనరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, గొల్లపూడి సుధాకర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, దోగుపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగాభవానీ అలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

కారంచేడు (పర్చూరు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధం కావడంతో పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

చినుకు రాలదాయె!

(5వ పేజీ తరువాయి)

శాఖ వెల్లడించింది. 54.5 శాతం లోటు నమోదైంది. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. దుర్గి, కారంపూడి, అచ్చంపేట, అమరావతి, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో 35.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 30.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 14.5 శాతం లోటు ఉంది. 25 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు, ఆరు మండలాల్లో సాధారణ, ఐదు మండల్లాలో అధిక, ఒక మండటంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చుండూరు, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, కొరిశపాడు, చినగంజాం మండలాల్లో అత్యధిక లోటు, అమృతలూరు, బట్టిప్రోలు, చెరుకుంపల్లె, బల్లికురవ, పర్చూరు, చీరాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో 22.7 శాతం లోటు వర్షపాతం ఉంది. ఇప్పటి వరకు 48.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాల్లోని 6 మండలాల్లో అత్యధిక లోటు, మరో ఆరు మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధారణ, ఒక మండలంలో అధిక, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు ఈస్ట్ మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం ఉంది. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు వెస్ట్, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

తగ్గిన చికెన్ ధరలు

- పెరిగిన కోళ్ల బరువు, ఉత్పత్తి
- అనుకూలించిన వాతావరణం



చికెన్ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

అద్దంకి, జూన్15 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం అంటే మండే ఎండలతో ఫారాలలో కోళ్ల పెంపకం తగ్గుతోంది. అదే సమయంలో ఎండలకు ఉత్పత్తి పడిపోతుంది. అయితే ఈ ఏడాది వేసవికాలంలోనూ ఎండలు తగ్గాయి. అదే సమయంలో వాతావరణం చల్లబడింది. దీనికితోడు ఎయిర్ కండీషన్ కోళ్ల ఫారాలు బాగా పెరిగాయి. దీంతో కోళ్ల ఫారాల్లో కోళ్ల పెంపకం పెరగడంతో పాటు తక్కువ కాలంలోనే బరువు కూడా పెరిగాయి. దీంతో అంచనాలకు మించి ఉత్పత్తి వచ్చింది. ఈ నేపథ్యంలో చికెన్ ధరలు మండేకాలంలో ఒక్కసారిగా తగ్గాయి. ఇటీవల వరకు కిలో చికెన్ రూ.200 నుండి రూ.220 వరకు ఉండగా ప్రస్తుతం అద్దంకిలో కిలో చికెన్ రూ.150లకు తగ్గింది. దీంతో కొనుగోలుదారులు చికెన్ కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అద్దంకిలో చికెన్ దుకాణాలు ఆదివారం మాంసం ప్రియులతో కిటకిటలాడాయి.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



ముప్పవరం ఎస్సీకాలనీలో పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పంగులూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం ఎస్సీ కాలనీ లో పాఠశాల చిన్నారులు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు తల్లికివందనం పథకం ద్వారా వారి బ్యాంక్ ఖాతాలలో నగదు జమ కావడంతో ఆదివారం ఎస్సీ కాలనీలోని చర్చి వద్ద సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికివందనం లబ్ధి చేకూరడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేల్పుల మరియదాసు, పార్టీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్మోహనరావు, ఇంటూరి రామకృష్ణ, శివశంకర్, వీరాంజనేయులు, భావన్నారాయణ, సామియేలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకొల్లు విద్యార్థిని మన్వీతకు నీట్‌లో ర్యాంక్



జాగర్లమూడి మన్వీత

ఇంకొల్లు, జూన్ 15,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని జాగర్లమూడి మన్వీతమహాలక్ష్మి 534 మార్కులు సాధించి ఆలిండియా నీట్ పరీక్షలలో 20941 ర్యాంకును సాధించింది. జనరల్ క్యాటగిరిలో 8556 స్థానాన్ని దక్కించుకున్నారు. మన్వీత తల్లిదండ్రులు వేణుబాబు, సీతాదేవిలు ఇంకొల్లులో బాలాజి భోజనం హోటల్ నడుపుతుంటారు. మన్వీత మహాలక్ష్మీ చిన్నతనం నుంచి డాక్టరు కావాలనే లక్ష్యంతో కష్టపడి సీటు సంపాదించుకున్నట్లు తెలిపింది. మన్వీతను గ్రామస్థులు, ప్రముఖులు అభినందించారు.

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

(5వ పేజీ తరువాయి)

రూ. 5 కోట్ల మధ్యన ఉంటే రూ.లక్ష, రూ.5 కోట్ల కంటే అదనంగా ఉంటే రూ. 2.50 లక్షల బ్యాంకు గ్యారెంటీని ముందుగానే సమర్పించాలి. ఇతర ఉత్పత్తులకు అయితే వరుసగా రూ. లక్ష, రూ.2 లక్షల, రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50 వేలు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు అన్ని నోటిఫైడ్ వ్యవసాయ ఉత్పత్తులను ఒక గొడుగు కిందకు చేర్చి టర్నోవర్ రూ. కోటి లోపు ఉంటే రూ.2 లక్షలు, రూ. కోటి నుంచి రూ.5 కోట్ల మధ్యన ఉంటే రూ.4 లక్షలు, రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7 లక్షలు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకు ఎంత టర్నోవర్ ఉన్నా రూ.లక్షగా బ్యాంకు గ్యారెంటీని నిర్ణయించారు. ఈ సవరణలు కేవలం కొత్తగా జారీ చేయబోయే కమీషన్ ఏజెంట్ లైసెన్సులకు మాత్రమే వర్తింపు చేస్తారు.

మిర్చి యార్డులో కొత్త లైసెన్సుల జారీకి సన్నాహాలు

మిర్చి యార్డులో అతి త్వరలోనే కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని మార్కెటింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు కొంత మంది పేర్లను మార్కెటింగ్ అధికారులకు నివేదించి వాళ్లకు లైసెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై మార్కెటింగ్ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అనుమతి రావాల్సి ఉంది. కాగా మిర్చి యార్డులో లైసెన్సు ఉంటే దానిని లీజుకు తీసుకొని ఏటా రూ.3 లక్షలకు పైగా నగదుని బడా వ్యాపారులు చెల్లిస్తుంటారు. దీంతో కొత్త లైసెన్సు పొందేందుకు రూ. 20 లక్షల వరకు చెల్లించడానికి కూడా వెనుకాడరు.

ఉన్నట్టా.. లేనట్టా!?

(5వ పేజీ తరువాయి)

సదరు అధికారులు పనిచేసే చోట నుంచి ఉన్న ఫలంగా రిలీవ్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే ఎవరినీ రిలీవ్ చేయవద్దని డీఏఏలకు కమిషనర్ కార్యాలయం నుంచి సందేశం వచ్చింది. 10వ తేదీ నుంచి సవరించిన జాబితా వస్తుంది రిలీవ్ కావచ్చు అని బదిలీ అయిన అధికారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా సవరించిన జాబితా విడుదల కాకపోవడం అధికారుల్లో అసహనానికి కారణం అవుతుంది.

మార్పులు జరుగుతాయని..

ఈ నెల 9న విడుదలైన మండల వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వులను తర్వాత సవరించారు. డీడీఏ, ఏడీఏల జాబితానూ సవరిస్తారేమోననే అనుమానం చాలామందిలో ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమైంది. బదిలీ సంగతి ఏమయ్యిందో తేలకుండా పిల్లల విషయంలో నిర్ణయం తీసుకోవడం కష్టతరమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు.